
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 6 మార్చి 2024



శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అరసవల్లి, మార్చి 5: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 8, 9 తేదీల్లో శ్రీముఖలింగం, రావివలస, సాబకోట, రామతీర్థం క్షేత్రాలకు ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండు డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీముఖలింగం చక్రస్నానం పురస్కరించుకుని ఈ నెల 11న అదనంగా 12బస్సులను నడుపుతున్నామన్నారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాద్భుతం.. మహేంద్రం

● 8న మహా శివరాత్రి ● నేటి నుంచే యాత్ర ప్రారంభం


మహేంద్రగిరులు..


కొండపై పరశురాముడి విగ్రహం

(హరిపురం)

ఓం నమఃశివాయ.. అంటూ భక్తజనం పారవశ్యంలో మునిగిపోతారు. కోరిన కోర్కెలు ఈడేరేందుకు శివాలయాల్లో అభిషేకాలు చేస్తారు. భక్తి శ్రద్ధలతో రాత్రంతా జాగారం చేసి.. విరూపాక్షుడిని వేడుకుంటారు. ఆ క్షణం.. మందస మహేంద్రగిరులు శివపంచాక్షరీ జపంతో మార్మోగిపోతాయి. ఈ నెల 8న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని.. బుధవారం నుంచి మహేంద్రగిరుల యాత్ర ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మహేంద్ర గిరుల మహామాన్విత మహాత్స్యం గురించి తెలుసుకుందాం.

మందస సమీపాన దండకారణ్యంలో.. తూర్పుకనుముల్లోని మహేంద్రగిరి పర్వతం.. సముద్ర మట్టానికి సుమారు 5400 మీటర్లు ఎత్తున పంచ ఆలయాలకు నిలయంగా ఉంది. పాండవుల పేరుతో ఆలయాలు ఉంటూ శివలింగాష్టకం ప్రతిష్ఠించి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఏటా మహా శివరాత్రి నాడు ఈ శివాలయాలకు జిల్లాతో పాటు అనేక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. శివరాత్రికి రెండు రోజుల ముందు నుంచే ఇక్కడకు చేరుకుంటారు. అనేక పర్వతారోహణలు కాలినడకన దాటి ఈ మహాద్భుతాన్ని ప్రత్యక్షంగా చూసి పొందే అనుభూతి అనిర్వచనీయమని భక్తులు చెప్పుకుంటారు.

పురాతన చరిత

పాండవులు అరణ్యవాసం సమయంలో ఈ గిరిపై కొంతకాలం గడిపి.. ఆరాధన కోసం ఈ ఆలయాలు నిర్మించారని పురాణగాథ. బారువ సముద్ర తీరం నుంచి 48 కిలోమీటర్లు దూరంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఈ గిరులున్నాయి. సామంత రాజులు, జమీందారీల పాలనలో బడ్డి గజపతులు, రాయగడ, తుంబకోట, పర్లాఖిముడి, మందస రాజులు ఈ గిరిని స్వాధీనపరుచుకొనేందుకు అనేక యుద్ధాలు చేసినట్లు పూర్వీకులు చెబుతున్నారు. దీని ఫలితంగా కొన్ని కట్టడాలు శిథిలమయ్యాయని పేర్కొంటున్నారు. అనంతరం కాలక్రమంలో మందస రాజుల ఆధీనంలోకి వచ్చిన తర్వాత 1935లో ఈ ఆలయాలకు మరమ్మతులు చేసినట్లు శిలాశాసనాలు చెబుతున్నాయి. ఇవన్నీ నేడు ఒడిశా ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోవడంతో అభివృద్ధి సన్నగిల్లిందని పండితులు వాపోతున్నారు.


మహేంద్ర గిరులపై ధర్మరాజు ఆలయం

అద్భుత కట్టడాలు

శిఖరాగ్రభాగాన ఉన్న ప్రధాన ఆలయమైన ధర్మరాజు మందిరం సుమారు 150 అడుగుల ఎత్తు ఉంటుంది. మందిరం చుట్టూ సువిశాల ప్రాంతం ఉంది. ఈ గోపురం ఆగ్నేయ దిశకు వాలినట్లు కనిపిస్తోంది. ఆలయానికి కొద్దిదూరంలో సుమారు నాలుగు హెక్టార్ల వైశాల్యం గల రాతిబండపై అనేకచోట్ల శివలింగాలు ఉన్నాయి. ఇవి చిన్న కుటీరాల వలే రాళ్ల కట్టడాలతో నిర్మితమై ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ధర్మరాజు గుడికి దక్షిణదిశగా సహదేవుని ఆలయం, మరికొద్ది దూరంలో మరో శిథిల గోపురం (కర్ణాలయం) ఉంది. కీకారణ్యంగా చెట్లమధ్య భీష్మాలయం సుమారు 30 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో 100 అడుగుల ఎత్తులో అర్జునాలయం, గిరి శిఖరాగ్ర భాగంలో మరో 50 అడుగుల ఎత్తులో భీముని ఆలయం ఉన్నాయి. దిగువ భాగంలోని వనవాస కాలంలో పాండవులు నిర్మించుకున్న వంటశాల, వినియోగించిన రాతి వస్తువులు కనిపిస్తాయి. ధర్మరాజు ఆలయానికి రెండు కిలోమీటర్లు దూరంలో సభావేదిక దర్శనమిస్తుంది. మహేంద్రగిరులపై నుంచి పరిశీలిస్తే.. ప్రకృతి రమణీయ దృశ్యాలు కనువిందు చేస్తాయి.

ఇలా చేరుకోవాలి

- శ్రీకాకుళం నుంచి జాతీయ రహదారి మీదుగా పలాస చేరుకోవాలి. అక్కడ నుంచి మందస మీదుగా సాబకోట వరకు ఆర్టీసీ ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సుల్లో వెళ్లాలి. సుమారు 32 కిలోమీటర్లు కొండలు, వాగులను దాటి కాలి బాటన మహేంద్ర గిరులను చేరుకోవాలి.
- శ్రీకాకుళం నుంచి ఒడిశా పర్లాకిమిడి. కొయిపూర్ మీదుగా మహేంద్రగిరులను చేరుకోవచ్చు. ఈ రహదారిలో గిరుల వరకు రవాణా సౌకర్యం ఉంది. కొయిపూర్ వరకు బస్సు ప్రయాణం చేసి అక్కడ నుంచి ప్రైవేటు వాహనాలపై గిరులపైకి చేరవచ్చు.


మహేంద్ర గిరులపై వెలసిన శివలింగం

చంద్రబాబు పర్యటన రద్దు

శ్రీకాకుళం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మాజీముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన రద్దయింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. ప్రచారం మాదిరిగానే ఈనెల 8న పలాసలో భారీ సభ నిర్వహించేందుకు చంద్రబాబు పర్యటన ఖరారైంది. ఈమేరకు జిల్లా టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేపట్టారు. అయితే బుధవారం చంద్రబాబు ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఖరారైన సభలను రద్దు చేశారు. అలాగే ఈనెల 10తర్వాత జిల్లాలో చంద్రబాబు పర్యటన ఉంటుందని పార్టీనేతలు వెల్లడించారు.



'జయహో బీసీ'లో టీడీపీ జిల్లా నేతలు

మంగళగిరిలోని నాగార్జున వర్సిటీ సమీపంలో టీడీపీ-జనసేన కూటమి మంగళవారం నిర్వహించిన జయహో బీసీ సదస్సుకు జిల్లా టీడీపీ నేతలు తరలివెళ్లారు. ఇరుపార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్.. బీసీల సమగ్రాభివృద్ధి, సంరక్షణ కోసం బీసీ డిక్లరేషన్ విడుదల చేశారు. సదస్సులో జిల్లా నుంచి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కూన రవికుమార్, పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, గుండ లక్ష్మీదేవి, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభలో చంద్రబాబుకు నియోజకవర్గ పరిస్థితిని లక్ష్మీదేవి వివరించారు. అలాగే సభాప్రాంగణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తదితర నేతలతో బీసీల సమగ్రాభివృద్ధి, పలు విషయాలపై నేతలు చర్చించారు.

- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/కొత్తూరు



పనులు పూర్తికాకుండా.. గృహ ప్రవేశాలా?

● రేపు ఏహెచ్‌పీ గృహాల అప్పగింతకు శ్రీకారం ● ఆందోళనలో లబ్ధిదారులు

(పలాస)

గృహ నిర్మాణమంటే ఇంట్లో విద్యుత్, పెయింటింగ్, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు ఉండాలి. ఆ కాలనీలకు పక్కా రహదారులు, కాలువలు నిర్మించాలి. అయితే పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘానికి సంబంధించి కోసంగిపురం వద్ద నిర్మించిన ఏహెచ్‌పీ(అఫ్రోడబుల్ హౌసింగ్ పార్ట్‌నర్‌షిప్) గృహాలకు ఇవేవీ లేవు. అయినా గురువారం లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు అధికారులు సంకల్పించడం చర్చనీయాంశమవుతోంది. పనులు పూర్తి చేయకుండా.. గృహ ప్రవేశాలు ఎలా? అని లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

● టీడీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం 50 ఎకరాల విస్తీర్ణంలో.. 1,950 గృహాలు నిర్మించేందుకు టాటా కనస్ట్రక్షన్ కంపెనీకి పనులు అప్పగించారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టెండర్లు రద్దు చేశారు. అప్పటికే 950 గృహాలు పూర్తయ్యాయి. ఈ గృహాలకు పెయింటింగులు వేసి తాము లబ్ధిదారులకు ఇస్తామని వైసీపీ నేతలు ప్రకటించారు. ఏహెచ్‌పీ గృహాలు దక్కనివారికి సెంటు చొప్పున ప్రభుత్వ భూములు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వారు కట్టిన డబ్బులను ఇంతవరకూ చెల్లించలేదు. లబ్ధిదారుల నిధులన్నీ కమిషనర్ పేరుమీద బ్యాంకు డీడీలు ఉండడంతో కనీసం అసలైనా వస్తుందనే ఆశతో వారంతా ఉన్నారు.

● పూర్తయిన గృహాల్లో 500కు పైగా బ్యాంకు గ్యారెంటీలు, నగదు పూర్తిగా కట్టుకొని పక్కాగా రిజిస్ట్రేషన్లు చేశారు. బ్యాంకు గ్యారెంటీ ఉన్నవారిపై బ్యాంకర్లు వడ్డీల కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు.. పూర్తయిన గృహాలు వెంటనే ఇవ్వాలని పట్టణాభివృద్ధిశాఖకు ఆదేశించారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట ఇంజనీరింగ్ అధికారులు ఏహెచ్‌పీ గృహాలు పరిశీలించి.. వాటిని లబ్ధిదారులకు ఇచ్చేయవచ్చని చెప్పారు. దీంతో లబ్ధిదారులకు వీటిని అందజేసి.. గురువారం ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. కాగా తమకు కేటాయించిన గృహాలను చూసి లబ్ధిదారులు అవాక్కవుతున్నారు. ఒక్క గృహం కూడా పూర్తికాలేదు. ఇంతవరకూ రోడ్లు, కాలువలు, బాత్‌రూములు, మరుగుదొడ్లు, విద్యుదీకరణ, పెయింటింగ్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదని గుర్తించారు. నిర్మాణాల్లో నాణ్యతకూడా లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలుపులు, కిటికీలు కూడా సక్రమంగా అమర్చలేదని వాపోతున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఆ ఇళ్లలో తామెలా నివసించాలో.. తెలియక అయోమయం చెందుతున్నారు.

● ఈ వ్యవహారంపై మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. గురువారం గృహ సముదాయం ప్రారంభిస్తామన్నారు. పనులు పూర్తిచేసిన తర్వాతే లబ్ధిదారులకు గృహాలు అప్పగిస్తామని స్పష్టం చేశారు.


అసంపూర్తిగా ఏహెచ్‌పీ గృహాలు


పూర్తికాని కాలువల నిర్మాణం..


రోడ్డు కోసం చిప్స్ వేసి వదిలేసిన దృశ్యం

శివసాగర్ తీరంలో ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు, మార్చి 5: అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో మంగళవారం మధ్యాహ్నం ఎలుగుబంటి సంచరించడంతో పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. సముద్ర తీరం నుంచి వచ్చిన ఎలుగు సమీపంలో ఉన్న షెడ్లలో కలియతిరిగి పక్కనే ఉన్న తోటలోకి వెళ్లిపోయినట్లు పలువురు స్థానికులు తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలోనే ఎలుగు దాడిలో అనేక మంది గాయపడ్డారు. మళ్లీ కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సముద్ర తీర ప్రాంతానికి, తోటలకు వెళ్లేందుకు హడలిపోతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు స్పందించి ఎలుగులను నియంత్రించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వైభవంగా వాసుదేవుని రథోత్సవం



మందస, మార్చి 5: వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మందసలో త్రిదండి అహోబిలం రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన వాసుదేవుని ఉత్సవమూర్తులను రథంలో వేంచేసి ఊరేగించారు. ప్రతి ఇంటా మహిళలు కొబ్బరి, గుమ్మడికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఉత్సవ మూర్తులను ఆలయానికి చేర్చారు. పుష్పయాగం, ధ్వజావరోహణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. వాసుదేవుని కృపతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వాసుదేవునికి అభిషేకం, జీయర్ స్వాముల ప్రవచనాలు, తీర్థగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీముఖలింగంలో పటిష్ఠ బందోబస్తు

- పకడ్బందీగా శివరాత్రి ఏర్పాట్లు
- డీఐజీ విశాల గున్ని పరిశీలన

జలుమూరు, మార్చి 5: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో నాలుగురోజుల పాటు నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు విశాఖ డీఐజీ విశాల గున్ని తెలిపారు. మంగళవారం శ్రీముఖలింగేశ్వరుడ్ని ఆయన దర్శించుకున్నారు. శివరాత్రి ఏర్పాట్లతో పాటు ఉత్సవాలను రూట్‌మ్యాప్‌ను పరిశీలించి.. తగు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'జిల్లాలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా సరిపడా బందోబస్తు కేటాయించాం. శ్రీముఖలింగంలో ఉత్సవాలకు 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నాం. ఉత్సవాల ముగింపు రోజు వంశధారనదిలో జరిగే స్వామి చక్రతీర్థ స్నానాలకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేస్తున్నామ'ని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత, ప్రత్యేక దర్శనాలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసి ఆలయ ప్రాంగణంలో షామ్యానాలు వేయించాలని ఆదేశించారు. గ్రామం ఇరువైపులా వాహనాల పార్కింగ్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ మధుసూదనరావు, ఈవో పి.ప్రభాకరరావు, దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకులు నారాయణమూర్తి, ఎస్.వెంకటాచలం, అప్పారావు, సర్పంచ్ టి.సతీష్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్ పాల్గొన్నారు.


ఉత్సవాల ఏర్పాట్లను డీఐజీ విశాల గున్నికి వివరిస్తున్న ఎస్పీ రాధిక

సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం

టీడీపీ-జనసేన అధినేతలు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నేతలు అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి: వెంకటాపురంలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగిస్తున్న నేతలు

'సూపర్ సిక్స్'తో ప్రయోజనం

సంతబొమ్మాళి: టీడీపీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, సంతబొమ్మాళి మాజీ సర్పంచ్ రెడ్డి అప్పన్న అన్నారు. మంగళవారం సంతబొమ్మాళి పంచాయతీ వెంకటాపురంలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించారు. టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం జరుగుతుం దన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, వజ్జప్రభాకర్, సువ్వారి ప్రసాద్, పప్పు కృష్ణారావు, పంగ ఆశిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల ఆర్థిక స్వావలంబన

నరసన్నపేట: టీడీపీతోనే మహిళల స్వావలంబన సాధ్యమని, అందువల్ల రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం కరగాం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరప త్రాలు పంపిణీ చేసి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో నాయకుడు సాధు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలపై ప్రజలకు అవగాహన

టెక్కలి: టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు మంగళవారం మేఘ వరం గ్రామంలో ప్రజలకు అవగాహన కలిగించారు. పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి మాట్లా డుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మన భవిష్యత్ బాగుపడాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు రామకృష్ణ, ఇప్పిలి జగదీష్, కెల్లి శ్రీరాములు, ధవళ రామచంద్రరావు, మెట్ట చంద్రరావు, ధవళ వందనం, అల్లుమాధవ్, దల్లి ప్రసాద్‌రెడ్డి, ధవల రాజశేఖర్, సాదు జోగారావు, చల్ల అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఖాయం

సరుబుజ్జిలి: మహానాడు వేదికగా టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయం ఖాయమని టీడీపీ అధికారప్రతినిధి కూన సంజీవరావు అన్నారు. మంగళ వారం మూలసవలాపురం గ్రామ పంచాయతీ తురకపేటలో టీడీపీ శ్రేణులతో కలిసి సూపర్ సిక్స్ శంఖారావం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్ర ప్రగతి

జి.సిగడాం: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి టంకాల మౌళీశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూనుబిల్లి కూర్మారావు అన్నారు. మంగళవారం పెంట, డీఆర్ వలస, దవళపేట, దేవరవలస, గొబ్బూరు, నిద్దాం, బాతువ, నాగులవలస, టీడీవలస, వాంద్రంగి, చెట్టుపొదిలాం, తదితర గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మక్క నారాయణ రావు, కంచరాన సూరన్నాయుడు, మహాదాశ్యం చిన్నారావు, పైల రామకృష్ణంనాయుడు, జక్కంపూడి దాసు, నక్క మురళీధరరావు, సిగటాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: చిన్న కరగాం, టెక్కలి: మేఘవరం, సరుబుజ్జిలి: తురకపేట, జి.సిగడాం: బాతువలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నిర్లక్ష్యం





నిలిచిన జగనన్నకాలనీ గృహనిర్మాణాలు (ఇన్‌సెట్‌లో) పాడైన బోరు

నిలిచిన జగనన్న ఇళ్ల కాలనీ పనులు

పాతపట్నం, మార్చి 5: స్థానిక జగనన్న కాలనీ మినీ స్టేడియం చేరువలోని బోర్‌వెల్ మరమ్మతులకు గురైంది. దీంతో ఈ ప్రాంతంలో నీటి సమస్య తలెత్తింది. జగనన్న ఇళ్ల కాలనీ నిర్మాణాలకు ఈ బోరు నీటికే వినియోగిస్తున్నారు. అయితే అది మూలకు చేరడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు పాడై నెలరోజులవుతున్నా నేటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్‌ను వివరణ కోరగా పాడైన బోరు స్థానంలో కొత్త బోరు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు, మూడు రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



రైతులతో సమావేశం నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

కాశీబుగ్గ: జీడి పంటకు మద్దతు ధర కల్పించడంతో పాటు జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ కోరారు. మంగళవారం కాశీబుగ్గ అమ్మ ఆశ్రమం వద్ద వామపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి ఒకటిన మంత్రి అప్పలరాజు, సీఎంవో అధికారి ధనంజయరెడ్డితో ఈ సమస్యపై చర్చించారని, అయితే నెలరోజులైనా చర్చల్లోని అంశాలను అమలుచేయలేదన్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవు తున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి జీడి పంటను పంటల జాబితాలో చేర్చి రైతు భరోసా కేంద్రా ల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్‌రావు, వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, గణపతి, రామారావు, హేమారావు, గురయ్య, జోగారావు, డిల్లీరావు, అప్పయ్య శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి మహిళాశక్తి అవసరం



'నారీశక్తి వందన్' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: దేశానికి మహిళాశక్తి అవసరమని బీజేపీ టెక్కలి నియోజకవర్గ కన్వీనర్ అట్టాడ రవిబాబ్జీ అన్నారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం టెక్కలిలో 'నారీశక్తి వందన్ ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ లు అన్ని రంగాల్లో రాణించాలని, దీనికోసం ప్రధాని అనేక సంస్కరణలు తీసుకు వచ్చి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి, టెక్కలి నియోజకవర్గ కో-కన్వీనర్ నడుపూరు లక్ష్మీనారాయణ, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ధూపాన కామేశ్వరరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధూపాన రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు నాయకులుగా ఎదగాలి

పాతపట్నం: మహిళలు నాయకులుగా ఎదగాలని ఇదే ఆశయంతో ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సలాన శరత్ అన్నారు. మంగళవారం నారీశక్తి వందన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాన రాఘవ, జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

పలాస: విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మదర్‌థెరిసా విద్యాలయం ఛైర్మన్ వజ్జ భవానీ కోరారు. ఇటీవల జరిగిన సైన్స్ ప్రదర్శనలో విజేతలకు మంగళవారం బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ మేథోశక్తి వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ప్రయోగాలను నిరంతరం చేస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఆర్.ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, చిరంజీవి, శశిరేఖ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నందిగాం: మండలంలో పలు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను టెక్కలి పీఆర్ డీఈఈ ధర్మారావు మంగళవారం పరిశీలించారు. నందిగాం, తురకలకోటలో నిర్మించిన సీసీ రోడ్లు, పెద్దల వునిపల్లి రైతు భరోసా కేంద్రానికి వెళ్లే గ్రావెల్ రహదారితో పాటు పలు పనులను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి పి.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

బీసీలకు వెన్నెముక టీడీపీ



మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస, మార్చి 5: టీడీపీతోనే బీసీలకు ప్రాధాన్యం పెరిగిందని, బీసీలకు వెన్నెముకగా తెలుగుదేశం పార్టీ నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మంగళగిరిలో మంగళవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వైసీపీ బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా బీసీలకు పనిముట్లు ఇచ్చిన పాపాన పోలేదని, పదవుల్లోకి వచ్చేందుకు బీసీలను వినియోగించుకున్నారు గాని ఎవరికీ సరైన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. బీసీ స్టడీ సర్కిల్స్, పనిచేసేందుకు పనిముట్లు, ఇతర సౌకర్యాలు బీసీలకు కరువయ్యాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవడం ద్వారా బీసీలకు సము చిత స్థానం దక్కుంతుందని అభిప్రాయపడ్డారు.

గ్రామదేవత ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



అమ్మవారి విగ్రహ ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న మహిళలు

నందిగాం: నందిగాం గ్రామదేవత పాతపట్నం అమ్మతల్లి (నీలమణిదుర్గ) ఆలయ పునః ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకుడు మేడేపల్లి రమేష్ శర్మ, వేద పండితుడు సురేష్‌శర్మ తదితర రుత్వికుల పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించారు. గోపూజ, గణపతిపూజ, రుత్విక్ వరుణ, హోమాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలు, బాణా సంచా కాల్పుల మధ్య ఊరేగించారు. మహిళలు కలశాలు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రతి ఇంటి ఎదుట రంగవల్లులు తీర్చిదిద్ది అమ్మ వారికి హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం కుంకుమ పూజలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంపొందించుకోవాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం

హిరమండలం: రానున్న రోజుల్లో మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం ధనుంజయ రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి మహిళా సంఘ సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో గ్రామ సంఘాలు, చిన్న సంఘాల సభ్యులందరూ ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మండల మహిళ సమాఖ్య ప్రణాళికలు తయారు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి, టి.సూర్యనారాయణ, రాములమ్మ, జగన్, పెంటయ్య, సీసీలు, ఎంఎంఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

జలుమూరు: లింగాలవలసలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 28వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ దుంగ స్వామిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. గురువారం రాత్రికి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం, శుక్రవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్నా మన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

వలంటీర్లతో దువ్వాడ రహస్య సమావేశం

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో ఒక ప్రజాప్రతినిధి ఇంట్లో పంచాయతీకి చెందిన వలంటీర్లతో ఎమ్మెల్సీ, టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం రహస్య సమావేశం నిర్వహించారు. వలంటీర్లతో విడివిడిగా మాట్లాడినట్లు సమాచారం. క్లస్టర్ పరిధిలో టీడీపీ, జనసేనకు ఓట్లు వేసే వారిని గుర్తించి వారి ఓట్లు కూడా వైసీపీకి పడేటట్లు వలంటీర్లు పనిచేయాలని సూచించినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ రహస్య సమావేశానికి నౌపడ-1 ఎంపీటీసీ సభ్యురాలు లోపింటి దమయంతి, ఆమె భర్త మాజీ ఎంపీటీసీ లోపింటి రాములును ఆహ్వానించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

పోలీస్ స్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు

జలుమూరు: ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సెట్-2 పరీక్ష పత్రాలు మంగళవారం పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. ప్రశ్నా పత్రాలను ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈవో ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. మండలంలో ఆరు కేంద్రాల్లో 738 మంది విద్యార్థులు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



జలుమూరు: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఈ దిశగా విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృ తిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గతే డాది ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్

జలుమూరు: విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవరచుకోవాలని, తద్వారా ఉజ్వల భవిష్యత్ సాధించ వచ్చని హెచ్‌ఎం ఉంగటి అప్పలసూర్యనారాయణ అన్నారు. లింగాలవలస ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ బుక్క లక్ష్మణరావు, ఎంఈవో ప్రసాదరావు, పాల్గొన్నారు.

చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ఇచ్ఛాపురం: చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఈదుపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.తమ్మయ్య అన్నారు. మంగళవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరో రెండు వారాల్లో టెన్త్ పరీక్షలు ఉన్నందున కాలం వృథా చేయకుండా కష్టపడి చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ నర్తు ప్రసాద్, పీఎంసీ ఛైర్మన్ నర్సింహమూర్తి, వైస్ ఛైర్‌పర్సన్ జయశ్రీ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: నృత్యాభియనం చేస్తున్న విద్యార్థినులు

వంద రోజుల లక్ష్యం పూర్తి చేయకుంటే చర్యలు

- ● డ్వామా పీడీ చిట్టిరాజు



సిబ్బందిని ప్రశిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

కింజరాపువానిపేట(పోలాకి): ఉపాధి హామీ వేతన దారులకు 100 రోజుల పని లక్ష్యాన్ని పూర్తి చేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ చిట్టిరాజు ఆదేశించారు. మంగళవారం కింజరాపువానిపేట, వెదుళ్లవలస, పోలాకి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల ను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వేతనదారుడుకి రూ.150 తక్కువ కాకుండా వేతనం వస్తోందన్నారు. పనులను నాణ్య తతో చేపట్టాలన్నారు. తీర ప్రాంతాల్లో అటవీశాఖ అధికారు లతో పనుల విషయమై చర్చించా మన్నారు. వేసవి కాలంలో ఎండలేకుండా కొబ్బరి పందిళ్లు వేయించాలని సూ చించారు. మస్టర్ల వేయడంతో దిద్దుబాట్లు ఉండకూడదన్నారు. వేసవి ఎద్దడి ఏర్పడకుండా సాగునీటి చెరువులను, కాలువ లను శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమణ, రామకృష్ణ, సూరపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పనిదినాలు పూర్తిచేయాలి

పాతపట్నం: నెలాఖరులోగా 100 రోజుల పనిదినాలు పూర్తిచేయాలని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 34 పంచాయతీల్లో వేతన దారులకు పనిదినాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఏపీవో ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుపై అవగాహన

టెక్కలి: చిన్ననారాయణపురం గ్రామంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓటరు నమోదు పై ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఓటు నమోదు, ఓటు వేసే విధానంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వి.లూక్ పాల్, డి.వాసుబాబు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓటును అమ్ముకోవద్దు

నరసన్నపేట: ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థలో వజ్రాయుధమని, దానిని అమ్ముకోవద్దని కోరుతూ డ్వాక్రా సంఘాల మహిళలు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ఏసీ కొండలరావు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం జీటీ రోడ్డుపై మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం హేమ సుందర్, సీసీలు, సీఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ గారు అలిగారు!

● జనాలు లేరని అధికారులపై ఆగ్రహం

● రహదారిని ప్రారంభించకుండానే వెనుదిరిగిన తమ్మినేని



స్పీకర్ ప్రారంభించకుండా వదిలేసిన రోడ్డు

పొందూరు, మార్చి 5: శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులపై అలిగారు. జనాలు లేకుండా కార్యక్రమాలు ఎందుకు నిర్వహిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.80 లక్షలతో నిర్మించిన వావిలపల్లిపేట-తోలాపి రోడ్డును ప్రారంభించేందుకు మంగళవారం వావిలపల్లిపేట జంక్షన్‌కు స్పీకర్ చేరుకున్నారు. అయితే, అక్కడ కొద్దిమంది మాత్రమే జనాలు ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. స్పీకర్ కార్యక్రమం పట్ల ఇంత నిర్లక్ష్యమైతే ఎలా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రారంభోత్సవానికి వాహనం దిగిన ఆయన అక్కడ జనాలు లేకపోవడంతో ప్రారంభించకుండానే వెళ్లిపోయారు. స్పీకర్ వెంట గోకర్ణపల్లి సర్పంచ్ చింతాడ మాధురి, ఎంపీపీ ఉషారాణి, గోరింట నాయకులు బాడాన కృష్ణ, వైసీపీ నాయకులు ఉన్నారు.

మెనూ పాటించరు.. పౌష్టికాహారం ఇవ్వరు

● పక్కదారి పడుతున్న సరుకులు

● పట్టించుకోని అధికారులు

● ఇదీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితి



మెనూ లేని భోజనం చేస్తున్న చిన్నారులు



గొల్లకంచిలి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రోడ్డు

కంచిలి: మండలంలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించడం లేదు. చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. కందిపప్పు సైతం వండటం లేదు. గుడ్ల పరిమాణంలో తేడాలు ఉంటున్నాయి. గొల్లకంచిలి గ్రామంలో ఒకే భవనంలో మూడు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రానికి చిన్నారులు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ లోపంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కేంద్రాలకు వచ్చే గుడ్లు, పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాలను తరచూ తనిఖీ చేయాల్సిన ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ వివరణ కోరగా.. 'మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును సమీక్షిస్తున్నాం. నేను విధుల్లో చేరి 23 రోజులే అయింది. సమస్యలు మా దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు చెప్పి పరిష్కరిస్తా.' అని తెలిపారు.

విద్యుదాఘాతంలో యువకుడి మృతి

ఎచ్చెర్ల: కుప్పిలి గ్రామానికి చెందిన నిమ్మ లచ్చయ్య(35) మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చయ్య తన బావమరిది పెళ్లికి పిండి వంటకాలు తయారీలో భాగంగా విద్యుత్ బల్బు అమర్చేక్రమంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి ఆటోలో తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లచ్చయ్యకు భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు దీపిక, యక్షిత ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి మృతి.. ఇద్దరిపై కేసు నమోదు

ఎచ్చెర్ల: కుప్పిలి గ్రామానికి చెందిన వృద్ధుడు కిల్ల అప్పలస్వామి (69) మృతిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. ఎచ్చెర్ల ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. అప్పలస్వామి మనుమడు నాయన రాకేష్, కుప్పిలి ఉమారెడ్డి వాహనం పార్కింగ్ విషయంలో సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. వీరికి స్థానికులు సర్దిచెప్పి పంపించేశారు. కాగా మంగళవారం ఉదయం రాకేష్ పాలకేంద్రానికి పాలు పోసి తిరిగి వస్తుండగా.. దారిలో ఉమారెడ్డి, అతడి తల్లి హరిలక్ష్మి ముందు రోజు రాత్రి జరిగిన ఘటనపై వాగ్వాదానికి దిగారు. ఇదే సమయంలో సమీపంలో ఉన్న రాకేష్ తాత అప్పలస్వామి ఇరువురికి సర్దిచెప్పి విడదీసే క్రమంలో కిందపడిపోయి మృతిచెందాడు. దీంతో తన తాత మృతికి ఉమారెడ్డి, హరిలక్ష్మిలే కారణమంటూ పోలీసు స్టేషన్‌కు రాకేష్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఫ్లెక్సీలు చించివేత దుర్మార్గం



చించివేసిన జనసేన పార్టీ ఫ్లెక్సీ

బూర్జ: సంకురాడ వద్ద ప్రధాన రహదారిపై స్థానిక జనసేన పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తుతెలియనివారు చించివేశారు. ఈ ఘటనపై నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు స్పందించి, మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సైకో ముఖ్యమంత్రి పాలనలో వారి కార్యకర్తలు కూడా సైకోలుగా మారుతూ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలపై వైసీపీ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి పరాభవం తప్పదని, అందుకే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సీజ్ చేసిన ద్విచక్ర వాహనం, స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్ఈబీ పోలీసులు

హరిపురం: మందస మండలం కొండలోగాం పంచాయతీ టబాగాం గ్రామంలో మంగళవారం సీఐ జైభీం ఆధ్వర్యంలో ఎస్ఈబీ పోలీసులు దాడులు చేసి 1200 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడులు చేసి బెల్లం ఊటలతోపాటు చాపరాయి గ్రామంలో సారా రవాణా చేస్తున్న సవర శ్రీనాథ్ నుంచి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ.. సారా బట్టీలు నిర్వహించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారాకు సంబంధించిన సమాచారాన్ని 94409 02358 నెంబరుకు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగీశ్వరరావు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి: రేఖాదేవిపురం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా 10లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. సారాతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అత్యాచారం ఘటనపై కేసు నమోదు

లావేరు: మండల పరిధి యాతపేటకు చెందిన పెంటమాని వేణుగోపాల్‌పై అత్యాచారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సీహెచ్ స్వామినాయుడు మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ సోమవారం మధ్యాహ్నం తమ పంట పొలంలో మొక్క జొన్న పంటకు నీరు పెడుతుండగా వేణుగోపాల్ అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేయగా.. జీఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రలేఖనం పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



చిత్రలేఖనంలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ఎచ్చెర్ల: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల/ కళాశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ, ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్ట్, అనంత్ డైమండ్స్, కేఎల్ యూనివర్సిటీ (గుంటూరు) ఈ నెల 2వ తేదీన నిర్వహించిన 11వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఈ గురుకులం నుంచి 126 మంది విద్యార్థులు గీసిన చిత్రాలను పంపించంగా... 19 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 15 మందికి సిల్వర్ పతకాలు సాధించారు. అలాగే మిగిలిన విద్యార్థులు మెరిట్ అవార్డు సర్టిఫికెట్లు పొందారు. డ్రాయింగ్ టీచర్ జి.దుర్గారావు కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో తాను గీసిన చిత్రాలను ప్రదర్శించి.. బెస్ట్ ఆర్ట్స్ స్కూల్ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.రాంబాబు తదితరులు అభినందించారు.

విద్యార్థి దశ నుంచే కెరీర్‌ను మలచుకోవాలి

● వీసీ రజని.. బీఆర్ఏయూలో టెక్ ఫెస్ట్



మాట్లాడుతున్న వీసీ రజని



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఎచ్చెర్ల: విద్యార్థి దశ నుంచే కెరీర్‌ను మలచుకునేలా అడుగులు వేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వైబ్రెంట్ విస్తా-2కే24 పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న వైజ్ఞానిక, సాంకేతిక ప్రతిభా ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావం, బాధ్యత, నిరంతర శ్రమ, అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన పల్సస్ సీఈవో, బీఆర్ఏయూ పాలకమండలి సభ్యుడు గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తర్ఫీదు పొందాలన్నారు. కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక మార్పులను ఆకళింపు చేసుకుంటే మంచి వ్యాపార, పారిశ్రామిక వేత్తలు కాగలరన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ భాస్కర్, సీడీసీ డీన్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతికపరమైన అంశాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఆదిత్యుని దర్శించుకున్న సీసీఎస్ ఏడీజీ



ఏడీజీకి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని మంగళవారం సీసీఎస్ అడిషనల్ డీజీ (హైదరాబాద్ రీజియన) శిశిర్ బన్సల్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు వారికి అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, రామకృష్ణ శర్మ, ఇప్పిలి రంజిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పూడిక తొలగింపు



చెరువును శుభ్రపరుస్తున్న గ్రామస్థులు

ఇచ్ఛాపురం: డొంకూరు గ్రామంలో గల తాగునీటి చెరువును గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, మహిళలు అంతా కలిసి శ్రమదానం చేసి చెరువును బాగుచేశారు. మంగళవారం గ్రామస్థులంతా చేయి చేయి కలిపి చెరువులో పూడికలు తొలగించి చెరువును శుభ్రపరిచారు. చెరువులో పూడికలు పెరిగిపోవడంతో దుర్వాసన వెదజల్లింది. దీంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్థులే శ్రమదానం చేసి చెరువును బాగుచేసుకున్నారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు దున్న సోమేష్, బుడ్డ కల్యాణ్, జానికిరావు, లోకనాథం, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆమదాలవలస సీఐ గొంపా దివాకర్ వాయునందన యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ వరకు తిరిగి అక్కడ నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వరకు స్థానిక పోలీసులు రైల్వే పోలీసులతో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ కె.వెంకటేష్, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ దీపక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన రహదారిలో కవాతు నిర్వహించారు. అలాగే అన్ని రాజకీయ పార్టీ నాయకులు వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు కూడా పోలీసులకు సహ కరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకారం అందించాలని కోరారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అపోహలొద్దు

● రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం



మాట్లాడుతున్న అజయ్ కల్లాం

కలెక్టరేట్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం-2023పై ఎటువంటి అపోహలొద్దని, ఈ చట్టం ద్వారా భూ వివాదాలు, మోసాలను అరికట్టి యాజమాన్య హక్కులపై పూర్తి భరోసా కల్పించొచ్చని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ్ కల్లాం అన్నారు. 'హక్కులకు హామీ - రైతులకు భరోసా' పేరిట కలెక్టరేట్‌లో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్‌లతో కలిసి జిల్లాలోని రైతులు, అడ్వకేట్లు, పోలీసు అధికారులు, అడ్వకేట్లకు ఈ చట్టంపై మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు దేశంలోని 12 రాష్ట్రాలు ఆసక్తి చూపిస్తున్నాయని, భూములకు శాశ్వత హక్కు రావాలంటే ఈ చట్టం అమలు జరగాల్సిందేనన్నారు. యజమాని ఎక్కడ ఉన్నా భూమికి రక్షణ అవసరమని, మొబైల్ ఫోన్లో భూమి వివరాలను చెక్ చేసుకునే సౌలభ్యం ఈ చట్టం ద్వారా ఉంటుందన్నారు. భూముల రీసర్వేలో భాగంగా 6000 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని, కేవలం 2 శాతం మాత్రమే వివాదాలు ఎదురయ్యాయన్నారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ కమిషనర్ ఆర్.గోవిందరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య ఏడీ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత ఏదీ?

లావేరు: తమ రాజకీయ జీవితంలో ఇలాంటి దుస్థితి ఎన్నడూ చూడలేదని పాతకుంకాం ఎంపీటీసీ జనపాల భానోజీరావు, గుర్రాలపాలెం సర్పంచ్ షేక్ షాన్ భాషా ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషరిత్ సమావేశ మందిరంలో లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాతకుంకాం ఎంపీటీసీ భానోజీరావు మట్లాడుతూ.. గత ఐదేళ్లగా మడ్డువలస సాగునీటి కాలువ పనులు చేపట్టాలని పలు మార్లు మండల సమావేశాల్లో అధికారులు దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా ఉండటమే తప్పా గ్రామాల అభివృద్ధికి పనికి వచ్చే ఒక్కపని కూడా చేపట్టక పోతున్నామన్నారు. దీంతో ప్రజల ముందు తలదించుకునే పరిస్థితి నెలకొందన్నారు. గుమడాం సర్పంచ్ దుర్గాశి ధర్మారావు మాట్లాడుతూ.. పంచాయతీల్లో చేపట్టే మెటీరియల్ కొనుగోలు చేసేటప్పుడు జీఎస్టీ చెల్లిస్తున్నా, మండలాల్లో రెండోసారి జీఎస్టీ బిల్లులు చెల్లించమనడం దారునమన్నారు. ఈ సమావేశానికి పలువురు ఎంపీటీసీ, సర్పంచ్‌లు డుమ్మా కొట్టడంతో సమావేశం తూతూ మంత్రంగా సాగింది. రానున్నది వేసవి కావడంతో తాగునీటి ఎద్దడి గురించి కనీసం ప్రస్తావన లేకపోవడంతో సభకు హాజరైన సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ఎంపీడీవో ఎస్.కొండలరావు, జడ్పీటీసీ ఎం.సీతంనాయుడు, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ సునీత, ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ నిర్ధారణలో వీడియోగ్రఫీ కీలకం

కలెక్టరేట్: ఎన్నికల వ్యయ నిర్ధారణలో వీడియోగ్రఫీ పాత్ర కీలకమని సీపీవో లక్ష్మీప్రసన్న అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం వీడియో సర్వైలెన్స్ టీమ్‌ల కోసం వీడియోగ్రాఫర్‌లకు డీసీవో బాలాజీ నాయక్ అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను వివరించారు. వీడియోగ్రాఫర్లు ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఘటనలను చిత్రీకరించాలని, పోస్టర్లు, వీడియోలు, కటౌట్స్, బ్యానర్లు, ఫర్నిచర్ తదితర అంశాలను చిత్రీకరించాలన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట్రామన్, డీపీఆర్వో కె.చెన్నకేశవరావు, పలువురు వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారి సంబరం



అమ్మవారి ఘటాలతో మహిళలు

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాన్ని దాసన్నపేటకు చెందిన భక్తులు ఘనంగా జరిపారు. మంగళవారం దాసన్నపేట జంక్షన్ నుంచి మహిళలు అమ్మవారి ఘటాలతో, పానకాల కుండలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని అభిషేకాలు జరిపారు.

నారీ శక్తికి వందనం

ఇచ్ఛాపురం: నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో నారీశక్తికి వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పాఠశాలల విద్యార్థినులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆశి సత్యంరెడ్డి, తులసీరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ధర్నా వాయిదా



చర్చల్లో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

గుజరాతీపేట: ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలపై ఈ నెల 6వ తేదీన తలపెట్టిన ధర్నా వాయిదా వేస్తున్నట్టు ఏపీటీఎఫ్ స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఉపాధ్యాయులు నోటీస్ ఇవ్వడంతో మంగళవారం జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరామన్ చర్చలకు పిలవగా, పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో రావడం లేదు కనుక మ్యాన్యువల్‌గా ఇవ్వాలని కోరారు. ఈ స్లిప్పులు ఏప్రిల్ 30వ తేదీలోగా ఇస్తామని అంగీకరించారు. పీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వీటితోపాటు మరిన్ని సమస్యలను అధికారుల దృష్టికి ఉపాధ్యాయ సంఘ నాయకులు తీసుకువెళ్లారు. దీనిపై అధికారులు సమగ్రంగా చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ చర్చల్లో ఏపీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఎం.మనధన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు



నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉపాధి సిబ్బంది

గార: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు నల్లబ్యాడ్జీలతో సోమవారం కూడా విధులకు హాజరయ్యారు. తమకు వేతనాలు పెంచాలని, గ్రేడింగ్ విధానం అమలు చేయాలని, పీఆర్సీ వర్తింపజేయాలని, గత ఐదేళ్లగా కనీస స్థాయిలో వేతనాలు పెంపు జరగలేదని తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేతాలమ్మకు పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: నేతాలమ్మ అమ్మవారికి భక్తులు ముర్రాటలతో నీరాజనం పలికారు. మంగళవారం యాత్ర ముగింపు సందర్భంగా గ్రామ పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజల పాటు అమ్మవారికి ప్రత్యే పూజలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రైల్వే అధికారులకు సన్మానం

ఇచ్ఛాపురం: స్థానిక జేసీఐ ఆధ్వర్యంలో మంగళవారం సెల్యూట్ ది సైలెంట్ స్టార్ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న స్టేషన్ మేనేజర్ హెచ్‌కే సాహు, బుకింగ్ సూపరింటెండెంట్ ఎ.రమణ, రిజర్వేషన్ సూపరింటెండెంట్ డీఎస్ఎన్ మూర్తిలకు జేసీఐ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది అందిస్తున్న సేవలను క్లబ్ సభ్యులు కొనియాడారు. స్టేషన్ మేనేజర్ మాట్లాడుతూ.. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ అమృత్ భారత్ స్కీమ్‌కు నామినేట్ అయిందని తెలిపారు. జేసీఐ క్లబ్ సభ్యులు స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయడంపై మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, స్వరూప్ కుమార్, డిల్లేష్, జయదేవ్, పవన్‌కుమార్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరా రు. అలాగే వివిధ శాఖలకు సంబంధించి పూర్తి సమా చారంలో హాజరు కావాలని కోరారు.

సరుబుజ్జిలిలో రేపు

సరుబుజ్జిలి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీ గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎ.రత్నం తెలిపారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభంకానున్న ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌లో (ఆదర్శపాఠశాల) 6వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వైకుంఠరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, 5వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు ఆదారంగా, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపక చేయనున్నట్టు తెలిపారు.

జ్యోతిబా పూలే గురుకులంలో..

గుజరాతీపేట: జిల్లాలోని శాస్త్రులపేటలో గల మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 5 నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ దాసరి హేమంత్ తెలిపారు. ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో 5వ తరగతి ప్రవేశానికి రూ.100, ఇంటర్మీడియట్ ప్రవేశానికి రూ.250 చెల్లించాలని కోరారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న, ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఏ ప్రిల్ 27వ తేదీన ఉంటుందన్నారు.

కంటితుడుపు చర్యలతో మభ్యపెట్టలేరు

అరసవల్లి: వైసీపీ నాయకులు, ప్రభుత్వం కంటితుడుపు చర్యలతో ఇంకెంతో కాలం ప్రజలను మభ్యపెట్టలేరని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. అరసవల్లిలో గల తమ నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా.. జిల్లాలో అభివృద్ధి మాత్రం ఎక్కడా కానరావడం లేదన్నారు. స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ధర్మాన అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, మరి ఇలా అనడం ఎంతవరకు నిజమో మంత్రి ధర్మానకే తెలియాలన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు ఏవీ పూర్తి కాలేదని, గార మండలంలో శివారు భూమలకు కూడా సాగునీరందించే ఎత్తిపోతల పథకాన్ని కూడా నిర్లక్ష్యం చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తుందని, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలను అబద్ధాలతో నమ్మించే రోజులు పోయాయని, ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకే అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, మరోసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు.

కొబ్బరి పంటపై అవగాహన

కంచిలి: కొబ్బరి సాగులో యాజమాన్యం పద్ధతులు పాటిస్తే దిగుబడి బాగా వస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానశాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. మంగళవారం మకరాంపురం పంచాయతీలో ఆత్మ(శ్రీకాకుళం) వారి సౌజన్యంతో జిల్లా వనరుల కేంద్రం వారు కొబ్బరి సాగులో యాజమాన్యం పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరి సాగు, కొబ్బరిలో రకాలు, కొబ్బరిలో ఎరువుల యాజమాన్యం, కొబ్బరిని ఆశించు పురుగు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జగన్మోహన్, జిల్లా వ్యవసాయ సమాచార్ కేంద్రం సహాయ సంచాలకులు వెంకటరావు, ఏవో ధనుంజయరావు, మండల ఉద్యానవన అధికారి మాధవీలత, బాలరాజు పాల్గొన్నారు.

నామినేషన్ల నమోదుపై దృష్టి సారించండి

రణస్థలం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ వేసిన వారి దరఖాస్తులు నింపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఓటరు నమోదు అధికారి ఏసీపీ లక్ష్మణమూర్తి సూచించారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు ఏఏ పత్రాలు అవసరమో ముందుగానే తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గం పరిధిలో ఏడు పోలింగ్ కేందాల పేర్లు మార్చడంతో పాటు సర్దుబాటు చేసినట్టు తెలిపారు. రహస్యంగా వేయాల్సిన ఓటు 2019 ఎన్నికల్లో కొన్ని చోట్ల బహిరంగా చూపించడం జరిగిందని, అటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని టీడీపీ నాయకుడు చౌదరి నారాయణ మూర్తి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

ఇచ్ఛాపురం: గ్రామాల అభివృద్ధి వైసీపీ ప్రభుత్వం తోనే సాధ్యమని జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిరియా విజయ అన్నారు. మంగళవారం మండపల్లి, బాలకృష్ణాపురం పంచాయతీల్లో రూ.8లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేయడంతోపాటు బుడ్డెపుపేటలో రూ.5లక్షలు జడ్పీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ పిట్ట శేషమ్మ, మామయ్య, కారంగి మోహన్‌రావు, సాలిన డిల్లీ నూకయ్యరెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్‌గా రవి బాధ్యతలు



బాధ్యతలు చేపట్టిన రవి

ఆమదాలవలస: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా జి.రవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈయన ఇక్కడకు బదిలీ అయింది. గతంలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఎం.రవిసుధాకర్ అమరావతి జీఏడీకి బదిలీపై వెళ్లారు. కాగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ రవి మాట్లా డుతూ.. అందరి సహకారంతో మున్సిపల్ పరిధిలోని 23 వార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.